# ఇప్పపూలు

అడవి తల్లి వడిలో వాగులు వంకలు. వాటి వొడ్డున మంకిక్యాపు ల్లాంటి వనవాసుల గుడిసెలు. వాటి ఎదురుగ దాన్యము దాచుకునే గుమ్ములు, వాటిని మూడు వైపుల పలువరసలాగ రాళ్లు పేర్చిన గోడలు. వాటి ముందు చింత చెట్లు వేపచెట్లు. ఆ గుడిసెల సముదాయం. పక్కమ్మటే, పశువుల సన్న జీవాల దొడ్లు. అది తండాల స్వరూపం. తండనుండి తండకు పిల్లబాటలు. చుట్టు పట్టు ఊళ్లకు ఎగుడు దిగుడు బండ్లబాటలు. దొడ్లముందు నెగళ్ళు కక్కలు. తొడేళ్ళు, పులులు చిరుతలు అప్పుడప్పుడు దాడులు చేస్తూనేవుంటాయి. పొద్దున లేసీ పశువుల కాయడం, చెలుక పనులకు వెళ్ళటం తండావాసుల పనిపాటలు.

కొండవాగెమ్మటి వున్న ఓ తండపేరు ముంద్రాయి తండ. అక్కడ వుండే చెంచులు కాయకష్టం చేసుకుని కాలాన్ని బట్టి కొర్రలు, జొన్నలు, దనియాలు పండిస్తుంటారు. ఆవులను బర్లెను సాదుకుంటు పాలు నెయ్యిని అమ్ముతుంటారు. ఈ తండ చుట్టూర మోదుగు పొదలు, జానచెట్లు వాటికి వేలాడె గురువింద తీగెలు ఆవి వొదిలిన గురువిందలు ఎర్రగావుండి తలపై నల్లగా చూడముచ్చటగా వుంటాయి. మిగిలిన ఆడవంతా ఇప్పవనం. మత్తు వాసనలతో ఇప్పపూలు, వాటిచుట్టూ తిరిగే శీతాకోక చిలుకలు తేనెటీగలు. చెట్లకింద రాలిన ఇప్పపూలు కుప్పలు కుప్పలు ! వీటిని ఏరి బట్ట పెట్టి తీసేదే ఇప్పపూవు సార. ప్రతి గిరిజనుడు దానిని ఇష్టంగా సేవిస్తూ వుంటారు. సారమీద ప్రభుత్వ నిషేదం కనుక చాటుమాటుగా తయారుచేస్తువుంటారు. పండించిన పంటలతో పాటు సారను అమ్మి వచ్చిన పైకంతో ఉప్పులు పప్పులు తెచ్చుకుంటారు. ఈ తండల్లో సార తయారు చేయడం ఓ కుటీర పరిశ్రలాంటిది. అప్పుడప్పుడు ఆప్కారి వాళ్ళు దాడులు జరిపి శిక్షల పాలుచేస్తుంటారు. పట్టుపడితే దండగలతో పాటు దౌర్జన్యాల పాలు అవుతుంటారు. ఇళ్ళల్లో పెట్టె ఈ బట్టీలను ఎక్కువ భాగం స్త్రీలే చూస్తుంటారు. ఆప్కారి వాళ్ళకు రెడ్‌హాండెడ్‌గ దొరికేది స్త్రీలే. అందువల్లా వాళ్ళు నానా విధాల హింసలకు గురికాకతప్పదు. అప్పుడప్పుడు లైంగిక వేదింపులకు గురి అవుతూ వుండడం మామూలే. అట్లాటిదే పక్కతండాలో జరిగింది. చలికాం రోజులు, మంచుకురుస్తువుంది. తండాలో బట్టీలు వదిలి పొగంతా మంచుతో కల్సి పోతువుంది. ఆ దట్టమైన పొగమంచులో తండాలోపలికి జీపొచ్చి ఆగెవరకు ఎవరు

తెలుసుకోలేకపోయారు. అపూట కుక్కలు కూడ చలికి ముడుచుకుని పండుకుని జీపురాగెనే అటు పరుగెత్తినయి. ఎప్పుడు రెప్పపాటులో సారా కాగులను కనపడకుండా చేసేవాళ్ళు. ఈసారి కొందరు దొరికిపోయారు. సారకాగులు పగిలినయి. ఎంతో నికారసైన సార నేల పాలైంది. కాచిన వాళ్ళ ప్రాణం తల్లడింది. జనం ఉరుకులు పరుగులు. కొందరు తప్పించుకున్నారు. కొందరు పట్టుబడ్డారు. పట్టుబడ్డ వాళ్ళలో ఎక్కువమంది రొక్కాన్నిచ్చి తప్పించుకున్నారు. దాడి జరిపారు కనుక కేసు ఒక్కటన్న కావాలి. గుడిసెలన్నీటిని వెతికారు. ఎలుకల పరుగులు తప్ప మరేం కనిపించలేదు. పక్కవైపున్న దొడ్ల పొదలు వెతికారు. అటు ఇటు పరుగెత్తె తొండలు కనిపించాయి. వెతికెటప్పుడు ఆయా గుడిసెలకు సంబంధించిన ఆడవాళ్ళు, అడ్డు తగిలి బతిమిలాడి కొందరు, చూపు సందడిలో అల్ప జీవులు విశ్వామిత్రులు ఔతుంటె కాగులు కానరాకుండా పోతువున్నాయి. సారక్యానులు సాటుకుపోతున్నాయి. చివరికి ఓ ఇంటివాళ్ళను, వాళ్ళు కాచిన సారాను జీపు ఎక్కించుకున్నారు.

0 0 0

జీపొచ్చి పోలీస్ స్టేషన్ ముందాగింది. ఆప్కారి దారోగ నలుగురు జవాన్లు దిగారు. వాళ్ళవెనుకాల ఓనడీడు స్త్రీ మరో ప్రౌఢ వాళ్లవెనకాల వాళ్ళ భర్తలు దిగారు. వాళ్ళ చేతుల్లో కుండ, లొట్టి మరోవైపు వున్నాయి.

"జాగ్రత్త కుండ పగుల గొట్టేవు" అన్నాడు జవాను.

"పగుల గొట్టేదైతే ఎప్పుడో పగల గొడుదుం" లేసి కుండను పట్టుకుంటు అన్నాడు భిక్య. ఆప్కారి జీపు రాకను చూసి ఓ పిసి వెళ్ళి "అసలిది ఏది" అన్నాడు జవాన్‌తో.

"ఇదిగో అంటు ఓ కేన్‌ను" అందించాడు ఆప్కారి జవాను. వాటన్నిటిని పట్టుకుని వెళ్ళిన లంబాడీలు వరండాలోకి నడిచి, వాటిని అక్కడ వుంచారు. యస్.ఐ. తో కేసు వివరించి "వీళ్ళకు తగిన శిక్ష వేయించాలిసారు. ఈ బద్మాషులు రెప్పపాటున సారాను,త పెట్టిన బట్టీని కనిపించకుండా చేస్తూవుంటారు. వాళ్ళకంటే వాళ్ల ఆడవాళుష్ళ చాల వుశారు. మళ్లి చూసెలోపల మాయం చేస్తరు" అని చెప్పి వెళ్లి జీపులో కూర్చున్నాడు.

అసలు సంగతేమిటి అంటె. అత్తచూడకుండా కొడలిని తాకినపథ్భుడు 'పోనీలే' అనుకుంది. రెండవసారి రొమ్ములను తాకినప్పుడు గుడ్లురిమి చూసింది. ఆ చూపును దారోగ మనసులో వుంచుకుని వాళ్ళమీద కేసురాసాడు. ఆయన వెనకాలే జవానులు ఎక్కికూర్చున్నారు. జీపు కదిలింది. అసలు కేసు

సార మీద కాదు దిక్కారపు చూపు మీద. వాళ్ళలోని ఆరవై ఏళ్ల భిక్యను గుర్తుపట్టి "ఏయ్ ఎన్నిసార్లు చెప్పానుర బట్టీలు పెట్టవద్దని, వాని ముడ్డిమీద ఏసి సెల్ లేయర" అన్నాడు ఎస్.ఐ. భిక్యను కొడుకు భీంమ్లాను రెండు అంటించి తండ్రి వెనక నడుస్తున్న కొడుకు వైపు చూస్తు "అరే భీమ్లాగా దున్నలాగున్నావు కష్టంచేసుకుని బతకొచ్చుగ. ఈ దొంగసారా వ్యాపారం ఎందుకురా" అని పళ్ళు పటపట కొరికాడు. ఈ లోపు పిసి లాఠీతో రెండేసి సెల్‌లోతోసి, గేటేసాడు. రొండ్రోజులుంటె రోగం కుదురతది.

యస్.ఐ. సెంత్రి వైపు చూసాడు. సెంత్రి లంబాడ స్త్రీలతో ఏదో మాట్లాడుతువున్నాడు. వాళ్ళు అతనికి దండంపెడుతు ఏమెమో చెప్పుకుంటున్నారు. వాళ్ళ గడ్డ కున్న అద్దాలపైపడ్డ వెలుతురు కిరణాలు వరండాలోని గోడలకు ఫోకస్ అవుతున్నాయి. "అరె వాళ్ళు ఈ రోజంతా ఇక్కడే వుంటర్ర. తర్వాత మాట్లాడుకోవచ్చు. కానీ ఇటు పంపర" అన్నాడు యస్.ఐ. సంత్రివైపు చూస్తు.

"పొండి, ఆ కుండ, క్యాను అన్నీ పట్టుకపోండి. లోపల బాగ ఏస్తడు" అన్నడు సంత్రి. బిక్కుబిక్కుమంటూ మెట్లెక్కి వరండాలో నిలుచున్నారు.

కాళ్ళ కడియాలు శబ్దం కాకుండా.

సెల్ గదులముందు సింహంలా కూర్చున్న యస్.ఐ."రాంద్రి రాడ్రి" అంటు వాళ్ళవైపె చూస్తు "అత్తాకోడండ్లానే" అని అడిగాడు. కనుసొగల పైకి ఎల్తు వదులుతు.

అవును అన్నట్టుగ ముసల్ది తలాడించింది. "అచ్చమైన సార తాగి రంగు తేలివున్నరు. కోడలు కోడిపెట్టలాగుంది" అనుకుంటు ఓ వింత నవ్వు నవ్వాడు. ఇద్దరు దగ్గరికి వెళ్లి నిలుచున్నారు అమాయంకంగా" ఏమె, ఈ బట్టీలు పెట్టంది బతకరా? సారతాగి, పిట్టలను కుందేల్లను తిని ఎట్లా బలిసింర్రో!" అంటు కోడలిని ఎగాదిగా చూస్తు ఓసారి మీసాన్ని తాకున్నాడు. అత్త ఆ చూపులను భరించలేకపోతుంది. అప్పుడామె ఎదురుగ, తాకడానికి వస్తున్న ఏదు కొయ్యలు గుర్తొచ్చినయి. కోడలు తలవంచ్చుని నిలుచుంది.

స్త్రీ తనను ఎవరు ఏ భావంతో చూసేది క్షణంలో తెలుసుకుంటుంది. కాపట్లోనే జరగబోయే ప్రమాదాన్ని పసిగడుతుంది.

"అరె రంగన్న ఈ ముసలిదాన్ని సెల్‌లోవేయర" అన్నాడు. రంగన్న అత్త వీపున లాఠిని వుంచి నెట్టుకుపోయి సెల్‌లోకి నెట్టిండు.

"ఏమె నీపేరేందె" అడిగాడు యస్.ఐ. అప్పుడతని చూపు కోతి తేనెపట్టును చూస్తున్నట్టుంది.

"లచ్చిమి దొర" అంది తలవంచుకునె. అత్తను తనను వేరు చేసినందుకు భయంతో తల్లడిల్లుతు. అప్పుడు యస్.ఐ. తలమీది క్యాపు పాము పడగలా కనిపించిందామెకు.

"రోజు ఎంత సార తాగుతవె" అడిగాడు ఆమెను రెప్పకొట్టకుండ చూస్తు.

"నేను తాగనుదొర" అంది.

ఆ మాట అన్నప్పుడు ఆమె ముత్యాలాంటి పలువరుస మెరిసింది. నల్లని కనుసొగలకింది రెప్పలను తన్నుకొస్తున్న కనుగుడ్లు కదిలి, మనస్సులోని బాధను అదిమి పట్టగ కదులుతున్న గొడలాంటి ముక్కు కొంతసేపు యస్.ఐ. అలాగె చూస్తుండిపోయి "ఎవవరె నేముఖానికి పచ్చబొట్లు పొడిపించింది. చంద్రునిలోని మచ్చల్లాగ "అని, అడవిలో వుండేవాళ్లకు ఇంత అందం ఎట్లా అమరుతుందో అర్థం కాదు' అనుకుంటున్నప్పుడు అంతవరకు వెనక వేపచెట్టుకింద వున్న పక్క తండా సర్పంచ్ "నమస్కారం సార్" అంటు వచ్చి నిలుచున్నాడు.

"అరె నిలుచున్నారేమి కూర్చోండి నాయక్‌గారు. ఈ రోజు సర్పంచ్‌వి రేపు ఎం.ఎల్.ఎ. కావొచ్చు" అన్నాడు నవ్వుతు కుర్చీని చూపిస్తు.

"మీ నోటి వాక్యం అట్లాగే కానీయండి" అన్నాడు సర్పంచ్ రామావత్ నాయక్. సర్పంచ్ రాకతో లచ్చిమి కళ్లనిండా నీళ్లురుతు వున్నాయి. పొయ్యిమీద పొంగె పాలగిన్నె మీది మూతను పక్కకు కదిలిస్తే పొంగు తగ్గి, మూతకు పట్టిన ఆవిరి ఒక అంచునుండి చుక్కలు చుక్కలుగా రాలినట్టు ఎదలో సుడులు తిరిగిన బాధను ఆమె కనురెప్పలు దుఃఖపు చుక్కలుగ రాల్చుతున్నాయి. అప్పటివరకు వణికించిన భయం కాస్త తగ్గినట్టు అనిపించింది. తలమీదినుండి వేలాడిన దుప్పటితో ముక్కు అద్దుకుంది.

"నేను వెనక వేపచెట్టు కింద వున్న. ఆప్కారి దారోగ పోతుపోతు ఈ విషయం చెప్పిపాయే. వీళ్లదీమా పక్కతండేసార్. ఏదో తాగడానికి ఇంత కాసుకుంద్రేమో" అంటు సెల్ వైపు చూసాడు. తండ్రి కొడుకులు ఒక దానిలో వుండగ అత్త వేరే దానిలో వుంది. దేనికి తాళం వేయలేదు. తమ కులపు పెద్ద మనిషిని చూడగానె కాస్త ధైర్యం వచ్చింది వాళ్లకు. వాళ్ల తండా చుట్టూ తండాల్లో ఏదైనా జగడమైనా, కొట్టుకున్నా ఈయనే సరిచెప్పుతుంటారు. స్టేషన్‌కు, కోర్టుకు రానీయడు. ఇదేమోసారాకేసాయె. సర్పంచ్ రమావత్

నాయక్‌కు ఎటు తోయడంలేదు.

యస్.ఐ. వైపు చూస్తు "ఈసారి వదలండి" అన్నాడు.

"సర్పంచ్ గారు ఈ కేసును నేను పట్టింది కాదు ఆప్కారి యస్.ఐ. గారు పట్టుకొచ్చారు. మీరు వాళ్లకు చెప్పండి. వాళ్లు సరె అంటే నేను వొదిలేస్తాను అన్నాడు తేలికగా.

"నేను చెపుతునే వుంటా అయినా వీళ్లు వినరు. ఆ ముసలోడు, ముసల్ది మొదటి నుండి అలవాటు పడ్డ ప్రాణాలు. నిజాము కాలంలో కూడ గిరిజనులు సార కాచుకోవచ్చు, ఐదుశేర్ల సార తమలో వుంచుకోవచ్చు అని చూసి చూడనట్టు వుండేది.

ఆ తరువాత రామన్న కాలంలో కూడ అడివిలో వుండే వాళ్ల అలుపు సొలుపును దృష్టిలో పెట్టుకుని వాళ్ళ ఆచార వ్యవహారాలకు భంగం కలిగే ఏ చర్యను చేపట్టొరాదన్నారు. ఈసారి ఇప్పచెట్లేమొ ఆకులు కానరాకుండా పూసినయి అన్నాడు నాయక్.

"పూస్తే సార కాయాలనా" అడిగాడు యస్.ఐ.

"మరేం చేయమంటారు. లేకపోతే రాలి భూమికి బెత్తెడెత్తు పేరుకపోతాయి. చెట్టుమీదున్నప్పుడు, పిట్టలు తింటాయి. తేనేటీగలు పీలుస్తాయి. ఈ పూల కాలంలో కోకిలలూ మత్తుగనే కూస్తాయి. అంతెందుకు ఎలుగుబంట్లు తిని మత్తుగ తిరుగుతు మనుషులను నానా తిప్పలు పెడుతుంటాయి. ఓసారి ఏం జరిగిందంటె, తెల్లారిజామున కదా ఇప్ప పూపును ఏరేది. ఆ వేళ్ళప్పుడు ఆడ మగ వెళ్లి తలా కొన్ని చెట్లను ఎన్నుకొంటారు. అట్లా ఎన్నుకొని ఓ చెట్టుదగ్గరి వెళ్లె సరికె అప్పటికే పూత తినదానికి వచ్చిన ఎలుగు బంటి. మనిషి మీద పడి రక్కి చంపేసింది. అంటె ఈ పూవును పోగుచేసుకోవడంలో గడ ఎంత ప్రమాదం వుంది చూడండి అట్లాగే అడివి పందులు కూడ, ఈ పూవుకోసం తారట్లాడుతుంటవి. ప్రాణాలకు తెగించి వాటిని తరమలేక సావాలి. అందుకని ఈ పూవును ఎరుకుంటుంటం. ఆ తరువాత మీకు తెలుసు మాకు తెలుసు. తమరె చూసి చూడనట్టు వుండకతప్పదు. రాలిన పూలనే ఏరుకుంటాం. ఓ చెట్లను కొట్టేదిలేదు, అడవిని పాడు చేసేది లేదు" అన్నాడు నాయక్ ప్రాదేయపూర్వకంగా.

"ఊర్కే పూవునంత సేకరించి డిస్టిలరీలకు పంపితే పోలే" అన్నాడు. నాయక్ నవ్వి ఇప్పటికే తేనేపట్టుల తీసుకెళ్లి పట్టణాలలో అమ్మిస్తున్నారు. ఇక ఈ పూలను పట్టుకెళ్లితె వనవాసుల పనేం కాను?" అంటు అంగలార్చినట్టు

అన్నాడు. అడవి సంపద గూడ అడవిలో వుండే తమకు అందకుంటా పోతున్నందుకు లోలోన బాధపడుతున్నపుడు దూడ పాలు తాగకుండా యజమాని మూతికి ముళ్లమూకుడు కట్టేది గుర్తొచ్చి.

"మీరంటే డబ్బున్నవాళ్లు అందుబాటులో బ్రాంది విస్కీలు వుంటాయి కొనుక్కుంటరు. మరి మా పేదోళ్ల సంగతి" అన్నాడు తానే నాయక్.

"చట్టం విషయంలో పేదలు పెద్దలు ఇద్దరు సమానమే".

"అయితే ఏరులై పారె గుడుంబాను ఆపగలుగుతున్నారా? వాటిని తయారు చేసేవాళ్లను పట్టుకోగలుగుతున్నారా? మేమే దొర్కినాం చట్టానికి" అంటూ నాయక్ అసహనంగా చూసాడు.

"వాళ్లనూ పట్టుకుంటున్నాం. మీ పెద్ద నాయకులు వదిలేయమంటె వదిలేస్తున్నాం. ఆ విషయం మీ నాయకులను అడగాలి" అన్నాడు యస్.ఐ. తాపిగా నవ్వుతు.

"అట్లయితే వీళ్లనూ వదిలేయండి" ఈసారి కొంచం నవ్వుతు అన్నాడు.

"ఇది ఆప్కారి వాళ్లు పెట్టిన కేసు మేం కాదు" అన్నాడు యస్.ఐ.

"నేను వాళ్లతో మాట్లాడి వస్తాను. మీరూ దయచూపండి. " ఎండిన కర్రను పండిన పండ్లను ఏరుకునే వాళ్లమే కాని పెద్ద పెద్ద మీసాల వాళ్లలాగ గందపు చెక్కలను, పెద్ద పెద్ద అధికారుల్లాగ టేకుమాన్లను అమ్ముకోవటం లేదు. బంగ్లాలల్లో బారులల్లో ఫర్నీచరు కోసం దొంగ రవాణా చేసేటోల్లం కాదు. కాకుంటే పొయిల పుల్లలు ఏరుకుంటోలం సుమా. చట్టాన్ని మా బక్క ప్రాణాలవైపు మళ్లించకండి. బడా చోరులకు బంధాలు వేయండి" అన్నాడు నాయక్ ఆవేదనగా, "చెపుతున్నగా నా చేతిలో ఏమి లేదని" అన్నాడు.

"అయితే ఆప్కారి ఆఫీసు వెళ్లొస్తాను" అంటూ లేచి బయటికి నడిచాడు.

గంట గడిచిన తరువాత

స్టేషన్‌లో ఫోను మోగింది.

"సర్ నేను ఆప్కారి యస్.ఐ.ని మాట్లాడుతున్న" అవతలి కంఠం

"చెప్పండి"

"సర్పంచ్ గారు మరి మరి చెపుతున్నారు. ఆయన సంగతి మీకు తెలుసుగా బాగా పలుకుబడి వున్నాయన, గిరిజన మంత్రిగారి కుడిభుజం అని మీకూ తెలుసు అన్నాడు."

"మీ ఇష్టం మీరు వొదలమంటె వొదులుతాను"

"వదలండి నేనొచ్చి కాగితాలు వాపసు తీసుకుంటాను"

"ఈ రాత్రి ఈ నెమిలిని –" అంటు కింది పెదవిని కొరుకుతు అన్నాడు.

"వద్దు వద్దు కాలం బాగలేదు. తలనొప్పి తెచ్చుకోకండి కావాలంటె ఎటన్న వెళ్లొద్దాం సాయంత్రం క్లబ్ వైపు రండి" అన్నాడు.

"సరె మీరోసారి రండి" అంటు ఫోను పెట్టేశాడు.

'బతికిపోయినవే చిలుక' అనుకుంటు చూసిన చూపును గ్రహించి కంట్లో నలుసు పడ్డట్టు అనిపించగ అరచేత్తో అద్దుకుంది.

ఫోను పెట్టేసినపుడు పెన్‌స్టాండులోని పెన్ను కిందపడిపోయింది. 'అందుకో, ఇటివ్వు' అన్నట్టు చూసాడు.

ఆమె కదలలేదు.

"ఆ పెన్ను ఇటివ్వు" అన్నాడు చూటిగా చూస్తు.

ఆమె వంగి పెన్ను అందుకునేటపుడు తాను వంగ అప్పుడతనికి, ఇప్పపూవు గుర్తొచ్చింది. అదీ పసుపు రంగె! అందులోనూ మత్తూ!

0 0 0

తెల్లతెల్లవారంగా ఉన్నట్టుండి తండా అంత తల్లడిల్లిపోయింది. లచ్చినాయక్ బార్య గొల్లుమని ఏడుస్తు గుడిసె బయటికొచ్చింది, దొడ్డిముందు మంట కాగుతున్న లచ్చినాయక్ ఇంకొంత మంది బిత్తరపోయి చూసారు. లచిమి ఎదబాదుకుంటు ఏడుస్తూనే వుంది. అమ్మలక్కలు కూడి ఓదార్చుతూ విషయం అడిగారు. "పక్కలోని చంటిది కనపడదంలేదని, ఓ బిడ్డో, నా బిడ్డో" అని నెత్తి బాదుకుంటూ వుంది. మిగతా ఇద్దరు బిడ్డల ఏడుపుకు అంతులేదు. వాళ్ల ముక్కు నోళ్లు కూడ దుఃఖపు సొల్లును వదులుతున్నాయి. అది చూసి లచ్చినాయక్ ఏడుస్తూనే నిలుచోని వాళ్ళను దగ్గరికి తీసుకొని శూన్యంలోకి చూస్తున్నాడు.

"ఆ ఎలుగొడ్డు పనె అయ్యుంటుంది" అన్నాడు. ఏడుపును ఆపుకుంటు.

"కావొచ్చు ఆ మధ్య పక్క తండాలో ఇదే జరిగింది. ఆడుకునె పిల్లను అందుకుపోయింది" అన్నది ఓ వృద్ధ స్త్రీ.

అందరు వచ్చి అదోటి ఇదోటి చెప్పి అంగలార్చిపోతు వున్నారు. లచ్చినాయక్ మోకాళ్ల మీద తలానించి ఏడుస్తు ఇంటిముందటి చింత చెట్టుకింద కూర్చున్నాడు. నలుగురు నాలుగు రకాలుగా అంటూ వుంటె వింటు వున్నాడు. అతని ఆలోచనలు వెనక్కు వెళ్లాయి. మగ బిడ్డకోసం ఎదిరి చూడగ వరసగా

ముగ్గురు ఆడపిల్లలె కలిగారు. వాళ్లను పెంచడమే కష్టం అయింది. ఇక వాళ్ల పెళ్లీల సంగతి చెప్పనక్కరలేదు. పెద్దది పెళ్లీడుకొచ్చింది. అది కదిలితె కొంత నయం అనుకున్నాడు. పేదోనికి పేద సంబంధమే కుదురుతది. అట్లాగే జరిగింది. పది రోజుల్లో పెద్ద బిడ్డ పెండ్లి.

0 0 0

తండల మధ్య ఏటి పక్కన పెద్ద భవన నిర్మాణం జరిగిపోయింది. ఆ పని జరిగినన్నీ రోజులు రోజు తండ వాసులకు కూలి పని దొరికింది. కొన్ని రోజులు దొర్కిన కూలి ఎల్లకాలం నోట్లో మన్ను కొట్టే సంగతి అప్పుడాళ్లకు తోచలేదు. అక్కడ నిర్మించింది. ఓ పెద్ద డిస్టిలరీని ఇకనుండి పూచె ఇప్పపూవంతా అక్కడికి చేర్చాలి. ఆ ఫ్యాక్టరీలో ఆ పూవుతో మంచి వైన్ తయారవుంతుంది. దానిని అక్కడే సీసాల్లో నింపి పట్టణాలకు పంపుతారు. ఇకపైన వనవాసులకు మిగిలింది మట్టివాసనే! ఎందుకంటే వాళ్లె రోజు ఆ రాలిన పూవును ఏరి ఫ్యాక్టరికి చేరవేసేది. కాని వాళ్ళకు దక్కేది కాదు.

0 0 0

ఓ రోజు అత్తగారి ఇంటినుండి పెద్ద బిడ్డను పండుగకు తీసుకొస్తువున్నాడు ఎదురుగా కొండల మధ్యల నుండి సూర్యుడు పైకి ఎక్కివస్తున్నాడు. ఆ లేత ఎండకు పక్షులు రెక్కలాడిస్తు ఎగురుతున్నాయి. తోవ పక్కమ్మటి వున్న సెలిమలోని నీళ్లను తాగుతువున్న ఎలుగుబంటిని చూసిన బిడ్డ "అయ్యా" అని ఆగి దానివైపు వేలు చూపించి "అగ్గో చెల్లెను ఎత్తుకపోయిన ఎలుగొడ్డు అంది" లచ్చినాయక్ క్షణం ఆగి చూసి, దానికంటపడకుండ చెట్ల చాటుంగా వేగంగా నడిచి దాటిపోయారు. చెల్లెను ఎత్తుకపోయినప్పుడు తల్లి ఏడిచిన ఏడుపు గుర్తొచ్చి కళ్ల నీళ్లు పెట్టుకుంటు నడుస్తుంది తండ్రి వెనకాల పెద్దబిడ్డ

పెద్దబిడ్డ గుర్తు చేయడంలో చిన్న బిడ్డ కళ్లల్లో మెదిలింది. ఆ బిడ్డను తాను ఎట్లా అమ్మింది కళ్లల్లో కదిలింది.

ఒక్కసారె లచ్చినాయక్ గుండె కరిగి, కన్నీరుగ మారగ, కళ్లు మసకగా మారి నడిచే తోవ కనిపించకపోగ తన బిడ్డను ముందు నడవమని కాసేపు మౌనంగ నిలుచుండిపోయాడు.

ఆ రాత్రి లచ్చినాయక్ గుండె రాయి చేసుకుని చీకట్లో రోడ్ల వైపు నడుస్తూ వున్నాడు. తండ్రి భుజం మీద తలానించి నింపాదిగా నిద్రపోతుంది సంవత్సరపు పాప. పాలు పసుపు కలిపిన బంగారు రంగు. నల్లని కనుసోగలు. చక్కని ముక్కు' ముద్దొచ్చే రూపం. పాలు సరిగా దొరకకనేమో చిక్కిపోయింది.

లచ్చినాయక్ వడివడిగ రోడ్డు వైపు నడుస్తున్నాడు. రోడ్డు మీద ఓ కారు ఆగి వుంది. నాయక్ రాకను చూసిన కారు డోర్ తెరుచుకుంది. పాపను అందులో వున్న వ్యక్తికి అందించాడు. అదనంగా మరో పదిరూపాయల కట్టను అందించి "వీటిని కూడ వుంచుకో నాయక్, ఈ విషయం ఎవరికి తెలియవద్దు. నీ పెళ్లాం అరిచి అడావుడి చేస్తే విషయం అందర్కి తెలిసిపోతుంది. పత్రికల వాళ్లు రాస్తారు. పోలీసులు రంగంలోకి వస్తారు. అప్పుడు నీవు నేను జైల్‌పాలు". అన్నాడు కారులోని వ్యక్తి డోర్‌వేసుకుంటు, కారు కదిలింది. సరిగ్గా అప్పుడే ఓ పాము ఎలుకను నోట్ల కరుచుకుని వేగంగా రోడ్డుకు అడ్డంగా పరుగెత్తేది చూసి డ్రైవర్ కారును కాస్త స్లో చేసాడంతే!

డిసెంబర్ 2003.